www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 20 | సెప్టెంబర్ | 2026
పేజీలు : 8

## సిఏస్‌బి ముందు బాధితుల ఆందోళన




- రూ.3కోట్లకు పైగా అక్రమాలు



ప్రజాపక్షం/అశ్వారావుపేట : అశ్వారావుపేట పట్టణం లోని జంగారెడ్డిగూడెం రోడ్లో ఉన్న సిఏస్‌బి బ్యాంకులో బంగారు ఆభరణాల ద్వారా రూ.3 కోట్లకుపైగానే అక్రమాలు జరిగి ఉంటాయని బాధితులు ఆరోపిస్తున్నారు. రెండోరోజు శనివారం వందలాది మంది బాధితుల సిఆర్ఓ చేతిలో బలైపోయామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బాధితులు సైతం సిఆర్ఓనే నమ్ముకుని పూర్తిగా మిగతా 2లో..

# పాత చట్టం.. కొత్త చిక్కులు..!



-22ఎపై గ్రామాల్లో విస్తృత చర్చ
-అసైన్డ్ భూములు కొనుగోలు చేసిన వారిలో ఆందోళన
-ఆక్రమణలు, కబ్జాల సంగతి ఏమిటంటున్న ప్రజలు

ప్రజాపక్షం/ఖమ్మం

ఒక పాత చట్టం అది ఇప్పటిది కాదు 1908 రిజిస్ట్రేషన్ యాక్ట్‌లోని ఓ నిబంధన ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద చర్చకు దారి తీసింది. అటు రాజకీయంగా ఓ తుఫాన్ లేపగా రాజకీయాలకు సంబంధం లేని సామా న్య ప్రజల్లోనూ ఈ చట్టంపై విస్తృతంగా చర్చ సాగుతుంది. ఈ పాత చట్టం తెచ్చిన కొత్త చిక్కులే ఇప్పుడు ఎక్కడ చూసినా చర్చనీయాంశమయ్యాయి. 1908 రిజిస్ట్రేషన్ చట్టంలోని 22ఎ నిబంధన ఇప్పుడు కొందరికి ఖేదాన్ని, మరికొందరికీ మోదాన్ని తీసుకు వచ్చింది. 1908 రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఎ ప్రకారం ప్రభుత్వ అసైన్డ్, వక్ఫ్, ఎండోమెంట్, అటవీ భూములు వంటి కొన్ని నిర్దిష్ట ఆస్తుల రిజిస్ట్రేషన్లను ప్రభు త్వం నిలిపివేసింది. ఈ జాబితాలో ఉన్న భూములను కొనుగోలు చేయడం, విక్రయించడం లేదా రక్తసంబంధికులకు బహుమానంగా ఇవ్వడం చేయకూడదు. బ్యాంకుల్లోనూ దీనిని తనఖా పెట్టకూడదు. కానీ ఈ చట్టం కొద్ది రోజులు కండ్లు మూసుకోవడంతో పైన పేర్కొన్న అన్ని రకాల భూములకు రెక్కలొచ్చాయి. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైతే అసైన్డ్ భూములను బహిరంగ మార్కెట్‌లో క్రయ, విక్రయాలు జరిగాయి. మిగతా 2లో..

## ఎక్సైజ్ అధికారులకు 'బెల్ట్' సవాల్..!




-శబరి బార్‌పై పలు ఫిర్యాదులు
-నిబంధనలుకు విరుద్ధంగా మద్యం విక్రయాలు.. దాబాల్లో సిట్టింగ్‌లు



(ఫైల్)

ప్రజాపక్షం/వైరా: వైరా ఎక్సైజ్ పరిధిలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎక్సైజ్ సిఐ, ఎక్సైజ్ ఎస్సైల ముందు అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్ షాపుల నిర్వహణ సవాల్‌గా మారుతున్నాయి. కొణిజర్ల, తల్లాడ మండలాల పరిధిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత కొన్ని రోజుల క్రితం బెల్ట్ షాపులు నియంత్రించాలంటూ వైరా ఎక్సైజ్ కార్యాలయం ముందు అక్రమ మద్యం విక్రయాలు బెల్ట్ షాపులు నిర్వాహణపై కొంతమంది నిరసన తెలిపిన సందర్భాలు ఉన్నాయి. ఆ మండలాల్లో వైన్ షాపుల నిర్వాహకులే బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు వైరాలోని శబరి బార్ అండ్ రెస్టారెంట్ నుంచి బార్ పరిధికి బయటకు క్వార్టర్ బాటిళ్లను వైన్ షాపు తరహాలో విక్రయిస్తున్నారనే ఆరోపణలు గతంలోను వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ ఉన్నతాధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితుల్లో పూర్తిస్థాయి మార్పు కనిపించడం మిగతా 2లో..




## విద్యకు కాషాయికరణ ప్రమాదం

-పేదలను విద్యకు దూరం చేస్తున్న పాలకుల విధానాలు

-విద్యార్థి ఉద్యమాల సారధి ఏఐఎస్ఎఫ్

-ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్




ప్రజాపక్షం/ ఖమ్మం : భారతదేశంలో విద్య కాషాయికరణ ప్రమాదంలో ఉందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ తెలిపారు. విద్యను కాషాయికరణ చేయడంతో పాటు చరిత్రను వక్రీకరించేందుకు ప్రయత్నం జరుగుతుందని పసి మెదళ్లలో మతోన్మాదాన్ని నింపుతున్నారని ఆయన ఆరోపించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఖమ్మం జిల్లా 28వ మహాసభలు శనివారం స్థానిక ఐఎంఏ హాల్‌లో జరిగాయి. మహాసభలను పురస్కరించుకుని పాత సిపిఐ కార్యాలయం నెహ్రూ నగర్ నుండి పాత బస్టాండ్ మయూరిసెంటర్ మీదుగా మిగతా 2లో..

# పాత చట్టం.. కొత్త చిక్కులు..!

**(మొదటిపేజీ తరువాయి)** ఇదే దేవాదాయ వక్ఫ్ భూములను సైతం అక్రమించారు. అటవీ భూములకు కొంత మంది హక్కులు పుట్టించారు. ప్రభుత్వ నిబంధనలను తోసిరాజని యథెచ్ఛగా నిషేధిత జాబితాలో లేని భూముల వ్యవహారాల్లో ఎలా వ్యవహరిస్తారో 22ఎ లోని భూముల విషయంలోనూ అదే రీతిగా వ్యవహరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం ధరణిని తీసుకు వచ్చింది. ధరణి విషయంలో అధికారుల తప్పిదాలు కొందరి అత్యుత్సాహం కారణంగా కొత్త సమస్యలు తలెత్తాయి. ఉదాహరణకు ప్రభుత్వం ప్రజా ప్రయోజనార్థం భూములను సేకరిస్తే అం దులో ఎంత సేకరించినా ఆ సర్వే నెంబర్ మొత్తాన్ని నిషేధిత జాబితాలో ఉంచారు. ఇది పెద్ద గంగరగోళానికి దారి తీసింది. మొత్తానికి ధరణి రైతులకు అన్యాయం చేసిందని ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చింది. భూ భారత వచ్చిన తర్వాత ఈ 22ఎ సెక్షన్ ప్రకారం గ్రామాల్లో నిషేధిత జాబితా వెల్లడైంది.




### అసైన్డ్ విక్రయాలు..

1970 దశకంలో అప్పటి ప్రభుత్వం భూమి లేని నిరుపేదలకు సాగు చేసుకునేందుకు భూములను పంపిణీ చేసింది. నిరుపేద రైతులకు పంపిణి చేసిన ఈ భూమిని కేవలం సాగు చేసుకునేందుకు మాత్రమే వినియోగించాలి. ఎన్ని తరాలైనా అనుభవించవచ్చు కానీ విక్రయించేందుకు అవకాశం లేదు. ఇటువంటి వాటిలో సాగుకు లాకి కానీ భూములు కూడా ఉన్నాయి. ఒకప్పుడు పట్టణాలకు, నగరాలకు దూరంగా ఉన్నా నగరాలు, పట్టణాల విస్తీర్ణత తర్వాత ఈ అసైన్డ్ భూములకు రియల్ ఎస్టేట్, వివిధ సంస్థల ఏర్పాటు ఇతరత్రా అవసరాల నేపథ్యంలో మంచి డిమాండ్ ఏర్పడింది. కారుచౌకగా రావడంతో చాలా మంది అసైన్డ్ భూములను కొనుగోలు చేశారు. కొందరు రెవెన్యూ అధికారులు యధాశక్తి సహకరించారు. దీనితో అసైన్డ్ భూములు బడా బాబుల పరమయ్యాయి. గ్రామాల్లోనూ వ్యవసాయ భూమికి గడిచిన రెండు దశాబ్దాలుగా సాగు భూమికి డిమాండ్ రావడంతో గ్రామాల్లోనూ అసైన్డ్ భూముల క్రయ, విక్రయాలు యథేచ్ఛగా జరిగాయి. ఇప్పుడు ఆ భూములను నిషేధిత జాబితాలోకి రావడంతో కొనుగోలు చేసిన వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అర్హత లేని వారు అంటే అసైన్డ్ సాగు చేసేందుకు అర్హత లేని వారి చేతిలో భూమి ఉంటే ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకునే అవకాశం ఉందన్న ప్రచారం ఇప్పుడు గ్రామాల్లో గందరగోళానికి దారి తీసింది.

### యథెచ్ఛగా ఆక్రమణలు..

ప్రభుత్వ భూములను, అటవీ భూములను ఇతరత్రా నిషేధిత జాబితాలో ఉన్న భూ ములను యథెచ్ఛగా కొందరు అక్రమించగా మరి కొందరు ఇతరుల వద్ద నుంచి కొనుగోలు చేశారు. రెండు, మూడు దశాబ్దాల కాలంలో ఇటువంటి భూములు నాలుగైదు చేతులు మారినా ఘటనలు ఉన్నాయి. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులు వీటిపై ఎటువంటి అభ్యంతరాలను వ్యక్తం చేయకపోవడంతో ఈవిధంగా జరిగింది. ఇప్పుడు ఈ భూములు నిషేధిత జాబితాలో రావడంతో కొనుగోలు చేసిన వారు లేదా ఇప్పుడు ఎవరి చేతుల్లో భూమి ఉందో వారు ఆందోళనకు గురవుతున్నారు. మొత్తంగా అక్షర జ్ఞానం లేని వారు కూడా ఇప్పుడు 22ఎ గురించి తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఒక పక్క కొందరి భూములు పోతాయన్న ప్రచారం గ్రామాల్లో జోరుగా సాగుతుంది.

### ప్రభుత్వమే భయం పోగొట్టాలి..

అసైన్డ్ భూములు సహా నిషేధిత జాబితాలో లేని భూములు కూడా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 22ఎ నిషేధిత జాబితాలో చోటు చేసుకున్నాయన్న ఆందోళన రైతుల్లో ఉంది. క్షేత్రస్థాయి ఆలోచన లేకుండానే నిషేధిత జాబితాను ప్రకటించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దశాబ్దాలుగా నివాసం ఉంటూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణానికి అనుమతులు, బ్యాంకుల ద్వారా రుణాలు సహా అన్ని పొందినప్పుడు ఇప్పుడు నిషేధిత జాబితాలో చేర్చితే ఎలా అన్న ప్రశ్న వినవస్తుంది. కబ్జాలకు, ఆక్రమణలకు పాల్పడిన, తెలిసి అసైన్డ్ భూములను కొనుగోలు చేసినా లేదా తెలిసి తప్పిదం చేస్తే చర్యలు తీసుకుంటే తప్పు లేదు కానీ సామాన్యులు రూపాయి రూపాయి కూడబెట్టి భూములు, స్థలాలు కొనుగోలు చేసిన విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాల్సి ఉంది. ప్రభుత్వమే ఈ 22ఎకు సంబంధించి ప్రజల్లో ఉన్న భయాన్ని పోగొట్టాలి. మనిషికో రీతి కాకుండా చట్టం అందరికీ సమానమన్న రీతిలో 22ఎ అమలు జరగాలి. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత చర్చకు దారి తీసి రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్న ఈ విషయం కొందరి రోజుల తర్వాత కనుమరుగవుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. 22ఎను రాజకీయ అవసరాలకు కాకుండా భూ సమస్య పరిష్కారానికి, సామాన్యుడికి నష్టం జరగని రీతిలో ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

# విద్యకు కాషాయికరణ ప్రమాదం







**(మొదటిపేజీ తరువాయి)** పోటు ప్రసాద్ నగర్ (ఐఎంఏ హాల్) వరకు విద్యార్థి ప్రదర్శన నిర్వహించారు. 28వ మహాసభకు గుర్తుగా 28 మంది విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ పతాకాలను ధరించి ముందు నడిచారు. ఈ ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. మహాసభలను పురస్కరించుకుని ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ ఆవిష్కరించారు. మడుపల్లి లక్ష్మ ణ్, బుర్రా మనోజ్, అమృత అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభల్లో పుట్టా లక్ష్మ ణ్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమేపి విద్యా విధానాన్ని మారుస్తూ వచ్చిందని శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పరుగులు పెడుతున్న నేటి తరుణంలో చాందస వాదాన్ని పసిమెదళ్లలోకి చొప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బడ్జెట్‌లో విద్యకు నిధుల కేటాయింపు పూర్తిగా తగ్గిపోయిందని కేటాయించిన బడ్జెట్‌ను కూడా ఖర్చు చేయడం లేదని లక్ష్మ ణ్ ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే విద్యకు అత్యంత ప్రాధన్యతనిస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి పాలన ఆ దిశగా సాగడం లేదన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ విషయంలో ఆయన ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి పేద, మధ్యతరగతి విద్యార్థులను విద్యకు దూరం చేస్తుందన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతో పాటు ప్రైవేటులో ఫీజులను నియంత్రించాల్సిన ఈ ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందిందన్నారు. ఏఐఎస్ఎఫ్ భారతదేశంలోనే అతి గొప్ప విద్యార్థి సంఘమని స్వాతంత్ర్యానికి ముందు స్వాతంత్ర్యం తర్వాత అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించిన ఘన చరిత్ర ఏఐఎస్ఎఫ్‌కు ఉందన్నారు. విద్యా రంగ సమస్యలపైనే కాకుండా సామాజిక సమస్యలు, నిరుద్యోగం తదితర సమస్యలపై ఏఐఎస్ఎఫ్ పోరాడుతూ విద్యార్థి ఉద్యమ సారధిగా నిలిచిందన్నారు. అనేక మంది యోధులు ఏఐఎస్ఎఫ్‌లో పనిచేశారని వారందరి స్ఫూర్తితో ఏఐఎస్ఎఫ్ బహుముఖ పోరాటాల ద్వారా విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. ఏఐఎస్ఎఫ్ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశ విద్యారంగం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని పోరాటాలు మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం చూపుతాయన్నారు. విద్య అంగడి వస్తువుగా మారిందని కొనుగోలు శక్తి ఉన్న వారికే విద్య అందుబాటులో ఉందన్నారు. ఈ విధానానికి వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ నేతృత్వంలో పోరాడాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ మహాసభల్లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, ఇంచార్జి రావిశివరామకృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తినేని నీరజ, ఏపూరి లతాదేవి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ నాయకులు మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, చింతల రమేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులునాగులమీరా, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎస్‌బి ముందు బాధితుల ఆందోళన

**(మొదటిపేజీ తరువాయి)**
నష్టపోయామని ఆందోళనలో వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని బంగారం దుకాణదారులు వడ్డీ వ్యాపారస్తులు సిఆర్ఓ ద్వారా పెద్ద మొత్తంలో బంగారాన్ని తాకట్టు పెట్టి బాధితులకు ఇచ్చింది తక్కువ అయితే వేరే పేర్ల ద్వారా పెట్టి పెద్ద మొత్తంలో సిఆర్ఓ తీసుకున్నట్లు అర్థమవుతుంది. అయితే ఈ లావాదేవీల్లో బ్యాంక్ అధికారులకు సైతం పెద్ద మొత్తంలోనే ముట్టిందని, అందువల్లే బ్యాంక్ అధికారులు నోరు మెదపడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. నాలుగు సంవత్సరాలు పాటు ఈ వ్యవహారం కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా ఈ వ్యవహారంపై ప్రభుత్వం జోక్యం చేఉకుని చర్యలు తీసుకుంటే లబ్ధిదారులకు కొంతమేరకైనా న్యాయం జరుగుతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయల లావాదేవీలు చేతులు మారుతుంటే సిఎస్‌బి బ్యాంక్ అధికారులు చోద్యం చూస్తున్నారా అనే ప్రశ్నలు కూడా విన్పిస్తున్నాయి. బ్యాంక్ అధికారుల సైతం సిఆర్ఓతో కుమ్మక్కై ఉంటారని, దీంతో గత కొన్నేళ్లుగా ఈ వ్యవహారం సాఫీగా కొనసాగుతుందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ శాఖ జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఎక్సైజ్ అధికారులకు 'బెల్ట్' సవాల్..!

**(మొదటిపేజీ తరువాయి)** లేదనే విమర్శలు ఉన్నాయి.

### రోడ్డు పక్కన దాబాల్లో సిట్టింగ్‌లు

ఖమ్మం ఎక్సైజ్ కమీషనర్‌గా సోమిరెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత రోడ్ల ప్రక్కన నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల తొలగింపుపై ఉక్కుపాదం మోపారు. అయితే అదే సమయంలో రహదారుల వెంట ఉన్న పలు దాబాల్లో మద్యం సిట్టింగ్‌లు యధేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాబాల్లో మద్యం సిట్టింగ్‌లకు అనుమతులుఎవరు ఇచ్చారు? బెల్ట్ షాపులపై నిబంధనలు వర్తిస్తే దాబాల్లో సిట్టింగ్‌లపై ఎందుకు వర్తించవు? అనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. గతంలో వైరా ఎక్సైజ్ పరిధిలో పనిచేసిన అధికారులపై కూడా బెల్ట్ షాపులు, అక్రమ మద్యం విక్రయాల విషయంలో విమర్శలు వచ్చాయి. ప్రస్తుతం వారిలో పలువురు బదిలీపై వెళ్లగా నూతన అధికారులు బాధ్యతలు చేపట్టారు.

### నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు ఉంటాయా?

కొణిజర్ల, తల్లాడ మండలాల్లో నిబంధనలుకు విరుద్ధంగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బెల్ట్ షాపులపై నూతన ఎక్సైజ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. కేవలం రోడ్ల ప్రక్కన కనిపించే బెల్ట్ షాపులపైనే కాకుండా, వాటిని ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వైన్ షాపులు, నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్న బారు, దాబాలపై సమగ్రంగా తనిఖీలు నిర్వహిస్తారా? అన్నది వేచిచూడాలి. నిబంధనలు అందరికీ ఒకేలా వర్తిస్తాయా? లేక కొందరికే పరిమితమవుతాయా? అనేది నూతన ఎక్సైజ్ అధికారుల చర్యలతో తేలనుంది.

## పాత కక్షలతో వ్యక్తిపై దాడి

**ప్రజాపక్షం/కరకగూడెం:** గత మూడు నెలల క్రితం భీమరాజు అశ్వాపురంపాడు పెద్దమనిషి వెంకటేశ్వర్లు పై దాడి చేసి చంపారని కక్షతో భీమరాజుని శనివారం మధ్యాహ్నం ఆవులు మేపడానికి వెళ్ళగా ఎవరు లేని సమయంలో భీమరాజు పై కన్నేసిన వెంకటేశ్వర్లు కొడుకు వారితో ఇద్దరు, ముగ్గురు స్నేహితులతో కలిసి అడవిలో కత్తులు గొడ్డెలతో దాడి చేశారు.



కొన ఊపిరితో ఉన్న భీమరాజుని మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భీమరాజుకి భార్య, అయిదుగురు పిల్లలు, ముగ్గురు మగవారు, ఇద్దరు ఆడపిల్లలు, కేస్ పెట్టి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ పివి నాగేశ్వరరావు పూర్తి వివరాలు త్వరలో చెప్తానని తెలిపారు.

## ఘనంగా పోషకాహార మాసోత్సవాలు

**ప్రజాపక్షం/కరకగూడెం:** మణుగూరు ప్రాజెక్టు కరకగూడెం మండలం అనంతారం సర్కిల్ తాటి గూడెం అంగన్వాడి కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలకు తల్లులకు పోషకాహారం పై అవగాహన కల్పించారు. అలాగే వివిధ రకాల



ఆహార పదార్థాలు, చిరుధాన్యాలు, ప్రాముఖ్యత అంగన్వాడి సేవలు అనేక అంశాలపై తల్లులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రాజమణి, సర్పంచ్ కొమరం విజయ, అంగన్వాడి టీచర్స్,తల్లులు హాజరయ్యారు.

## వైరా మండలంలో పర్యటించిన డిపివో వినోద్

### పలు పంచాయతీల్లో రికార్డులు పరిశీలన

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలోని తాటి పూడి, గొల్లపూడి, రెబ్బవరం గ్రామాల్లో డిపివో వినోద్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, వాటి పురోగతిపై గ్రామపంచాయతీ కార్యదర్శులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీల్లో రికార్డులను పరిశీలించారు.




అనంతరం గ్రామ సర్పంచ్‌లతో సమావేశమై గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించాల్సిన మౌలిక వసతులపై చర్చించారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన ఏర్పాట్లు, సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని డిపివో వినోద్ తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, గ్రామపంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ధంసలాపురం చెరువు వద్ద నిమజ్జనంకు ఏర్పాట్లు

**-విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు**
**-పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలి**
**-నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని ధంసలాపురం చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వినాయక నిమజ్జనం పురస్కరించుకుని కావాల్సిన సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో గణేష్ ఉత్సవాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా నిర్వహించేందుకు అన్ని సౌకర్యాలతో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువులో నీటి మట్టం ఉన్నందున బారికేడింగ్, గజ ఈతగాళ్లు, క్రేన్స్, బోట్లు, రక్షణ పరికరాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి పోలీసులతో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలన్నారు. రాత్రి నిమజ్జనాలకు తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ముందుగానే సిద్ధం చేసి అత్యవసర వాహనాలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఎత్తు కలిగిన గణేష్ విగ్రహాలకు ఇబ్బందులు లేకుండా నిమజ్జన ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందు కోసం ప్రత్యేక రూట్, ట్రాఫిక్, పోలీస్ బందోబస్తు, రవాణా ఏర్పాట్లు ముందుగానే చేయాలన్నారు. భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, వైద్య సదుపాయం అందుబాటులో ఉంచాలన్నారు. విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ షాక్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద క్రేన్లకు అదనపు డ్రైవర్లను ఏర్పాటు చేయాలని మెకానిక్‌లను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేసి నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి : సీపీ సునిల్ దత్



**ప్రజాపక్షం/చింతకాని :** కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి దర్యాప్తు వేగవంతం చేయాలని సీపీ సునిల్ దత్ అన్నారు. శనివారం చింతకాని పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి , పెండింగ్‌లో ఉన్న కేసులు, సిబ్బంది పని తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు పలు కీలకసూచనలు, ఆదేశాలు జారీ చేశారు. నేరాలు, నేరస్తులకు సంబంధించిన వివరాలను పోలీస్ కంప్యూటర్ వ్యవస్థలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. దర్యాప్తులో ఎలక్ట్రానిక్ సాక్ష్యాలను సమర్థవంతంగా వినియోగిస్తూ , ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో భద్రపరచాలని ఆదేశించారు. భూ వివాదాలకు సంబంధించిన కేసుల్లో నిర్దేశిత ప్రామాణిక విధానాలను తప్పనిసరిగా పాటిస్తూ నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని అన్నారు.మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, గంజాయి తదితర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం , వినియోగంపై నిరంతర నిఘా కొనసాగించాలన్నారు.ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీలు, డిజిటల్ అరెస్టులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పెండింగ్‌లో న్న కేసులను చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేసి కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజలకు భద్రత కల్పించే విషయంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నరేష్, ఏఎస్ఐ లక్ష్మణ్ చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రఘునాథపాలెం మండల విద్యాశాఖాధికారి బి. రాములు తెలిపారు. పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రఘునాథపాలెంలో శనివారం ఒక చెట్టు అమ్మ పేరుతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బి. రాములు, ఉప సర్పంచ్ బి. ప్రశాంత్ పాల్గొని తల్లుల పేరుతో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంఈవో తెలిపారు. ఏకో క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై గ్రామంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఎంఈవో పాల్గొన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం అత్యంత కీలకమని ఎంఈవో తెలిపారు. హెచ్ఎం ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి విద్యతో పాటు క్రమశిక్షణ, ఆరోగ్యం, క్రీడలు, సృజనాత్మకత, నైతిక విలువలు ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బి. ఉపేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదేవిధంగా వేపకుంట్ల ఉన్నత పాఠశాలలో ఏక్ పేడ్ మాకే నామ్ (ఒక చెట్టు అమ్మ పేరుతో) కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా పాల్గొని ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి తల్లుల పేరుతో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గాయత్రి, శ్రీకాంత్, అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్మన్ మేడేపల్లి సుజాత, ఉపాధ్యాయులు రమాదేవి, సుమలత, మల్లికార్జునరావు, జావిద్, పంచాయతీ కార్యదర్శి అనిల్, స్థానికులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, రాజా, గురవయ్య, నాగమణి, వెంకటేశ్వర్లు, పంచాయతీ సిబ్బంది సందీప్ పాల్గొన్నారు.

# బొజ్జ గణపయ్య లడ్డు కైవసం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని కిష్టారం అంబేద్కర్‌నగర్ బీసీ కాలనీలో 23 ఏళ్లుగా కొనసాగుతున్న వినాయకోత్సవాల్లో భాగంగా శనివారం బొజ్జ గణపయ్య నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐదు రోజులపాటు పూజలందుకున్న గణనాథుడి లడ్డూ ప్రసాదాన్ని వేలం వేయగా మారోజు శ్రీను కరుణ దంపతులు రూ.6,500 ల కు దక్కించుకున్నారు. అనంతరం గణపతి విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో భక్తుల కోలాహలం మధ్య ఊరేగించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, అంబేద్కర్‌నగర్ బీసీ కాలనీ పెద్దలు, యువత, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

# 21న టియూడబ్ల్యూజె(ఐజెయు) ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఈ నెల 21వ తేదీ సోమవారం ఉదయం 10గంటలకు టియూడబ్ల్యూజె(ఐజెయూ) ఆధ్వర్యంలో జర్నలిస్టులకు హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు టియూడబ్ల్యూజె(ఐజెయూ) ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నామా పురుషోత్తం, శీలం శ్రీనివాస్, కోశాధికారి పిన్ని సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యశోద క్లినిక్ సెంటర్‌లో యశోద హాస్పటల్ వైద్యులచే పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వైద్యశిబిరాన్ని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించనున్నారని, ఈ కార్యక్రమానికి జిల్లా పౌరసంబంధాల శాఖాధికారి గౌస్, జిల్లా గ్రంథాయల చైర్మన్ ఖాదర్‌బాబా, టియూడబ్ల్యూజె(ఐజెయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఇంకా యూనియన్ రాష్ట్ర, జిల్లా, నగర బాధ్యులు, నాయకులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ శిబిరంలో గుండె పరీక్షలతో పాటు ఇతర జనరల్ వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. 21న ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు జరిగే ఈ వైద్యశిబిరాన్ని జర్నలిస్ట్ మిత్రులు తమ కుటుంబసభ్యులతో వచ్చి వినియోగించుకోవాలని కోరారు.

# అన్నదానం అభినందనీయం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అన్నదానం చేయడం ఎంతో అభినందనీయమని మున్సిపాలిటీ కమీషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం ఏదులాపురంమున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో శ్రీసాయిగణేష్ ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. తొలుత కమిటీ సభ్యుడు యాస లక్ష్మారెడ్డి కమీషనర్ ఏసీపీ, సిఐలకు వినాయకుని వద్ద ప్రత్యేక పూజలు జరిపించి, శాలువులతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండటం అలవర్చుకోవాలన్నారు. 9నవరాత్రులు ఎంత భక్తి శ్రద్ధతో జరుపుకుంటారో అదే విధంగా నిమజ్జనాం కూడా అంతే భక్తి శ్రద్ధలతో జరపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐలు ముష్క రాజు, తిరుపతిరెడ్డి, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చెట్ల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యం




**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో స్వచ్ఛతా సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్,వైరా మున్సిపాలిటీ తొలి వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, 13వ వార్డు కౌన్సిలర్ ముళ్లపాటి విజయలక్ష్మి పాల్గొన్నారు. చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించి అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. చెట్ల పెంపకంతో కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించవచ్చన్నారు. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వార్డు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారి చార్లెస్ ఫిన్నీ వైద్య చికిత్సకు కమ్మ వారి సేవా సమితి అండగా నిలిచింది. చిన్నారి కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని శనివారం అందించింది. ఈ కార్యక్రమానికి చల్లగుళ్ల నరసింహారావు చొరవతో పాటు కమ్మ సామాజిక వర్గానికి చెందిన దాతలు సహకరించారు. ఆపదలో ఉన్న కుటుంబానికి ఆర్థిక సాయంతో పాటు మానసిక ధైర్యాన్ని అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. చిన్నారి చార్లెస్ ఫిన్నీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ఘనంగా అమ్మ పేరుపై ఓ మొక్క



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అమ్మ పేరుతో మొక్కను నాటి, భవిష్యత్ తరాలకు పచ్చని ప్రపంచాన్ని అందించాలని సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ నర్సింహా, మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వర రావు పిలుపునిచ్చారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా శనివారం విశ్వశాంతి విద్యాలయంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. విద్యార్థులకు మొక్కలు అందజేసి వాటిని తల్లి పేరుతో నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం సత్యనారాయణ పాల్గొన్నారు.

# పెరుగుతున్న వృద్ధాశ్రమాలు.. తగ్గుతున్న మానవ సంబంధాలు..!

-తల్లిదండ్రులకు దూరమవుతున్న పిల్లలు...
ఆస్తి కోసం బంధాలనే తెంచుకుంటున్న వైనం
-మారుతున్న జీవన విధానమా....? విలువల పతనమా...?
బాధ్యత ఎవరిది...?





**ప్రజాపక్షం/ తల్లాడ :** ఒకప్పుడు ఇంట్లో పెద్దవాళ్లు ఉంటే ఆ ఇంటికి ఒక భరోసా. తాతయ్య, నాయనమ్మల చుట్టూ పిల్లల సందడి తల్లిదండ్రులకు పెద్దల సలహాలు, కుటుంబంలో సమస్య వస్తే అందరూ కలిసి పరిష్కరించుకునే పరిస్థితి కానీ నేటి పరిస్థితుల్లో ఆ కుటుంబ అనుబంధాలు క్రమంగా బలహీనపడుతున్నాయి. పిల్లల చదువు, ఉద్యోగం, వ్యాపారం, విదేశీ అవకాశాల పేరుతో దూరమవుతుండడంతో అనేక మంది వృద్ధ తల్లిదండ్రులు ఒంటరితనాన్ని ఎదుర్కొంటున్నారు.

**వృద్ధాశ్రమాల వైCపు అడుగులు :**
వయసు మీద పడిన తల్లిదండ్రులకు చివరి దశలో పిల్లల ప్రేమ, అప్యాయత, తోడు అవసరం కానీ కొందరి జీవితాల్లో ఆ తోడు కరువవుతుంది. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, భార్యాభర్తల మధ్య విబేధాలు, ఉద్యోగ కారణాలతో దూరంగా ఉండటం వంటి అనేక కారణాలతో వృద్ధులను వృద్ధాశ్రమాల్లో చేర్పిస్తున్న కుటుంబాలు కనిపిస్తున్నాయి. వృద్ధాశ్రమం అవసరమైన వారికి రక్షణ కల్పించే సంస్థ కావచ్చు. అయితే సొంత కుటుంబం ఉన్నప్పటికి కేవలం బాధ్యత నుంచి తప్పించుకోవడానికి తల్లిదండ్రులను అక్కడ వదిలేయడం మాత్రం ఆలోచించాల్సిన సామాజిక సమస్య.

**ఆస్తి కోసం బంధాలే బలైపోతున్నాయా...?**
కుటుంబంలో ప్రేమ, అనుబంధాల కంటే ఆస్తి, డబ్బు , వారసత్వం ముఖ్యమవుతున్న సందర్భాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆస్తి పంపకాల విషయంలో తల్లిదండ్రులు పిల్లల మధ్య వివాదాలు ఏర్పడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఈ గోడవలు పోలీస్ స్టేషన్లు, కోర్టుల వరకు వెళ్తున్నాయి. అత్యంత విషాదకరమైన సందర్భాల్లో ఆస్తి కోసం తల్లిదండ్రులపై హింసకు పాల్పడిన ఘటనలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. తల్లిదండ్రుల ప్రాణాలకే ముప్పు తెచ్చే స్థాయికి కుటుంబ వివాదాలు చేరడం సమాజంలోని విలువలపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతుంది. ఇది కేవలం పిల్లలనే నిందించి ముగించాల్సిన సమస్య కాదు. కుటుంబ వ్యవస్థలో వచ్చిన అనేక మార్పులు దీనికి కారణమవుతున్నాయి.

**కుటుంబంలో సంభాషణ తగ్గడం :**
డబ్బు కేంద్రంగా మారుతున్న జీవన విధానం ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, పిల్లలు ఉద్యోగాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లడం, భార్యభర్తల మధ్య కుటుంబ బాధ్యతలపై భిన్నాభిప్రాయాలు చిన్నప్పటి నుంచే పిల్లలకు విలువల విద్యకు తగిన ప్రాధాన్యత లేకపోవడం.

**ఆస్తి, వారసత్వంపై పెరుగుతున్న ఆశలు :**
వృద్ధుల అవసరాలు, భావోద్వేగాలను అర్థం చేసుకోకపోవడం వంటి అంశాలు పరిస్థితిని మరింత కష్టతరం చేస్తున్నాయి. పిల్లలపై మాత్రమే బాధ్యత మోపడం కూడా సరైంది కాదు. పిల్లలను పెంచే సమయంలో వారికి ప్రేమతో పాటు బాధ్యత, పరస్పర గౌరవం, ఆర్థిక క్రమశిక్షణ, కుటుంబ విలువలను నేర్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనా ఉంటుంది. అదే సమయంలో వృద్ధాప్యంలో పిల్లలపై పూర్తిగా ఆధారపడకుండా తమ ఆర్థిక భద్రతను ముందుగానే ప్రణాళిక చేసుకోవడం కూడా అవసరం.

**పాఠశాల నుంచే విలువల విద్య :**
పిల్లలకు మార్కులు, ర్యాంకులు, ఉద్యోగ నైపుణ్యాలు ఎంత ముఖ్యమో మానవీయ విలువలు కూడా అంతే ముఖ్యం. తల్లిదండ్రులను గౌరవించడం, పెద్దలను ఆదరించడం, బలహీనులను కాపాడటం, కుటుంబ బాధ్యతలను అర్థం చేసుకోవడం వంటి అంశాలను చిన్నప్పటి నుంచే నేర్పాలి. చదువు మనిషికి ఉద్యోగం ఇవ్వాలి, విలువలు మంచి మనిషిగా నిలబెట్టాలి. అనే భావన విద్యా వ్యవస్థలో బలపడాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులు పిల్లల కోసం జీవితాన్ని త్యాగం చేస్తారు. తమ అవసరాలను పక్కన పెట్టి పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడతారు. వృద్ధాప్యంలో వారికి కావాల్సింది ఎప్పుడు డబ్బు మాత్రమే కాదు ప్రేమ, పలకరింపు, గౌరవం, కొంత సమయం. ఇవే వారికి గొప్ప ఆస్తి. పిల్లలు కూడా తమ తల్లిదండ్రుల వృద్ధాప్యాన్ని భారంగా కాకుండా తమ బాధ్యతగా చూడాలి. అదే సమయంలో తల్లిదండ్రులు కూడా పిల్లల జీవితాన్ని పూర్తిగా నియంత్రించకుండా పరస్పర అవగాహనతో వ్యవహరించాలి.

**సమాజం స్పందించాల్సిన సమయం :**
వృద్ధుల సమస్యను కుటుంబ సమస్యగా మాత్రమే చూడకుండా సామాజిక సమస్యగా గుర్తించాలి. స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు వృద్ధుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఒంటరిగా జీవిస్తున్న వృద్ధులను గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించే వ్యవస్థలు బలోపేతం కావాలి. వృద్ధాశ్రమాలు పెరగడం మాత్రమే సమస్య కాదు. వాటికి తల్లిదండ్రులను పంపాల్సిన పరిస్థితులు ఎందుకు పెరుగుతున్నాయన్నదే అసలు ప్రశ్న. కుటుంబంలో ప్రేమ ఉంటే వృద్ధాప్యం భారంగా అనిపించదు. పరస్పర గౌరవం ఉంటే ఆస్తి కోసం బంధాలు తెగిపోవు. పిల్లలకు విలువలు నేర్పితే తల్లిదండ్రులు ఒంటరితనంలో మిగిలిపోరు. తల్లిదండ్రులను కాపాడటం కేవలం కర్తవ్యం కాదు మనం చిన్నప్పుడు పొందిన ప్రేమకు ఇచ్చే కనీస ప్రతిఫలం. ఇప్పటికైనా కుటుంబాలు ఆలోచించాలి. డబ్బు, ఆస్తులు మనతో రావు. కానీ మనం చూపిన ప్రేమ,మనం కాపాడిన బంధాలు మాత్రం మనిషి జీవితానికి నిజమైన విలువను ఇస్తాయి.

## విద్యార్థులు ఎక్కువ.. ఉపాధ్యాయులు తక్కువ



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు అదనపు ఉపాధ్యాయుని కేటాయించాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం మండల విద్యావనరుల కేంద్రం వద్ద ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్య అందించాలని కోరారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడంతో ప్రస్తుతం ఉన్న సిబ్బందిపై బోధనా భారం పెరిగిందన్నారు. విద్యాశాఖ అధికారి శాంతారావు మాట్లాడుతూ ఆళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేసిన ఓ ఉపాధ్యాయుడు ఇటీవల వేరే మండలానికి వెళ్లడంతో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందన్నారు. సమస్యను దృష్టిలో ఉంచుకుని వలసల ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలిని డిప్యూటేషన్‌పై ఆళ్లపల్లి పాఠశాలకు కేటాయించినట్లు తెలిపారు. ఆమె సోమవారం నుంచి విధుల్లో చేరుతారని పేర్కొన్నారు.

## వినాయక మండపాల వద్ద అన్నదానం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండల కేంద్రంలోని ట్రాలీ ఆటో యూనియన్, ఎస్సీ కాలనీ, చింతలబజార్ వినాయక మండపాల వద్ద శనివారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సీఐ సిహెచ్ ఎల్లయ్య, వేములపల్లి రమేష్, హర్షిత దంపతులు కార్యక్రమాలను ప్రారంభించి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు. ఈకార్యక్రమాల్లో భక్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఎస్సీ కమ్యూనిటీ హాల్ పనులు వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలం సారపాక మేజర్ గ్రామ పంచాయితీ పరిధిలోని గాంధీనగర్‌లో ఎస్సీ కమ్యూనిటీ హాల్ పనులను వేగవంతం చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతూ కమిటీ సభ్యులు పంచాయితీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కమ్యూనిటీ హాల్‌లో బాత్రూం, నీటి, విద్యుత్ వసతులు పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. వినతి పత్రం స్వీకరించిన పంచాయితీ కార్యదర్శి సానుకూలంగా స్పందించి పనులను వేగవంతం చేసి త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో గాంధీనగర్ ఎస్సీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వినాయక మండపాల వద్ద సందడి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండలంలోని పలు గ్రామాల్లో వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వివిధ పార్టీల నాయకులు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అయ్యన్నపాలెం గ్రామంలోని హనుమాన్ ఆలయంలో పురోహితుడు ఇప్పర్ల వెంకటకృష్ణమూర్తి ఆధ్వర్యంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదానం చేశారు. చంద్రుగొండలోని బాలు మిల్లు బజార్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు తుమ్మలపల్లి సురేష్, బోజ్యా నాయక్, సారేపల్లి శేఖర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు వగ్గెల పూజిత, నరుకుల్ల సత్యనారాయణ, సురా వెంకటేశ్వర్లు, వంకాయలపాటి బాబురావు, నరుకుళ్ల వాసు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## తాళ్ళగొమ్మూరులో కోతుల బెడద



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని తాళ్ళగొమ్మూరు గ్రామ పంచాయితీలో కోతుల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన పరిటాల గణేష్ అనే యువకుడిని కోతులు కరిచిన ఘటన ఇటీవల చోటు చేసుకోవడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామ పంచాయితీలో రోజు రోజుకు కోతుల సంఖ్య పెరిగిపోవడంతో ఇళ్ల పరిసరాల్లోకి వచ్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని స్థానికులు తెలిపారు. అదే విధంగా వీధి కుక్కల సంఖ్య కూడా పెరగడంతో ప్రజలు, చిన్నారులు బయటకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కోతులు, వీధి కుక్కల బెడదను నియంత్రించేందుకు గ్రామ పంచాయితీ సర్పంచ్, అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## పాడైన రోడ్డును తొలగించి కొత్త రోడ్డు నిర్మించాలి




**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** వెంకటాపురం నుంచి భద్రాచలం వరకు పాడైపోయిన రోడ్డును తొలగించి కొత్త రహదారి నిర్మించాలని, ఇసుక లారీల రాకపోకలను నియంత్రించి ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం దుమ్ముగూడెం మండలం లక్ష్మీ నగరంలో పార్టీ ఆధ్వర్యంలో ఒక్కరోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు కె.చె.ఎల్ రంగారెడ్డి మాట్లాడుతూ ఇసుక లారీల ప్రమాదాల్లో 17 మంది మృతి చెందిన నేపథ్యంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం 17 డిమాండ్లతో దీక్ష చేపట్టినట్లు తెలిపారు. ప్రజా సమస్యలను పోరాటాల ద్వారా ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకే దీక్ష నిర్వహిస్తున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో దుమ్ముగూడెం మండల కార్యదర్శి దాసరి సాయన్న, డివిజన్ నాయకుడు సున్నం వీరభద్రం, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మునిగేల శివ ప్రశాంత్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు చింతకాయల సరళ, రామ్ అక్క వీరయ్య, రమేష్, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** అంజుబాక ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు స్థానిక సర్పంచ్ కొమరం శాంతమ్మ యూనిఫామ్స్, పుస్తకాలు, పలకలు, షూస్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు విద్యతో పాటు అవసరమైన విద్యా సామగ్రి అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పార్వతి, పంచాయితీ కార్యదర్శి సంధ్య, ఉపాధ్యాయులు రాంబాబు, మంగమ్మ, వార్డు సభ్యులు పాయం పుష్పవతి, కొమరం చంటి, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎస్టీ రిజర్వేషన్ల పెంపు ఘనత కేసీఆర్‌దే

**ప్రజాపక్షం/గుండాల:** ఎస్టీ రిజర్వేషన్లను 6 నుంచి 10శాతానికి పెంచిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ గుండాల మండల అధ్యక్షుడు తెల్లం భాస్కర్, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మోకాళ్ల వీరస్వామి, మండల నాయకుడు గడ్డం వీరన్న అన్నారు. శనివారం గుండాల మండల కేంద్రంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్టీల సంక్షేమానికి పలు కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఎస్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్టీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని వారు ఆరోపించారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు మొత్తం రవి, సయ్యద్ అజ్జు, నిట్ట రాములు, కుంజ శోభన్‌బాబు, పార్టీ కృష్ణ, కుంజ సుధాకర్, జాడి శ్రీను, బొమ్మెర్ల పద్మారావు, గంగాధరి ప్రమోద్, మొక్క ప్రశాంత్, మోకాళ్ల నరేష్, బొమ్మెర్ల సతీష్, బొబ్బిలి తిరుపతి, పూనెం మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

## కలెక్టర్ అంకిత్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాచలం గోదావరి నదిలో జరిగే వినాయక నిమజ్జనాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం గోదావరి తీరంలో ఆయన నిమజ్జన ఘాట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా లాంచీలు బారికేడింగ్ లైటింగ్ సిసి కెమోరాలు తాగునీరు వైద్య బృందాలు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. పోలీస్ రెవెన్యూ రవాణా వైద్య ఇరిగేషన్ అగ్నిమాపక దేవాదాయ ఇతర శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. నిర్ణయించిన ప్రాంతాల్లో మాత్రమే నిమజ్జనాలు చేయాలని, వాహనాలకు కేటాయించిన పార్కింగ్ ప్రాంతాల్లో నిలపాలని భక్తులకు సూచించారు. ఊరేగింపుల్లో డిజేలు ఉపయోగించ వద్దని, ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లకుండా శాంతియుతంగా నిర్వహించాలని కోరారు. అనంతరం సీతారామ చంద్రస్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఉత్తర ద్వారం చిత్ర



కూట మండపం గోశాల అన్నదాన సత్రం విస్తా కాంప్లెక్స్ మాడ వీధులు తదితర ప్రాంతాల్లో పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలూ పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాల నాటికి ఘాట్ల అభివృద్ధి పనులను పూర్తయ్యేలా చేయాలని సూచించారు.

# సతీష్‌కు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



## -విధి నిర్వహణలో తుపాకీ మిస్‌ఫైర్‌తో మృతి

**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం శాంతినగర్‌కు చెందిన హనుమకొండ సతీష్(40)కు శనివారం స్వగ్రామమైన సీతారాంపురం గ్రామ పంచాయితీ పరిధిలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. నిజామాబాద్‌లో ఏఆర్ ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న సతీష్ శుక్రవారం రైఫిల్ శుభ్రం చేస్తుండగా మిస్‌ఫైర్ కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అంత్యక్రియల్లో నిజామాబాద్ ఏఆర్ ఏసీపీ బి కృష్ణ, ఏఆర్ ఆర్ఐ అడ్మిన్ డి హరికుమార్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సీఐలు హనుమకొండ వెంకటేశ్వర్లు, తాటిపాముల సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మృతుడి కుటుంబానికి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఏసీపీ, ఆర్ఐల చేతుల మీదుగా రూ 30వేల చెక్కును అందజేశారు. సతీష్ విధి నిర్వహణలో నిబంధనలకు కట్టుబడి పని చేశారని, ఆయన సేవలను శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వపరంగా రావాల్సిన ప్రయోజనాల త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సతీష్‌కు భార్య కళ్యాణి, కుమార్తె చర్విక(14), కుమారుడు ప్రహన్ చౌర్య(11)ఉన్నారు.

# అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ను ప్రభుత్వం మంజూరు చేస్తుందని మంత్రి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి పేర్కోన్నారు. మండల కేంద్రం లోని క్యాంపు కార్యాలయం లో శనివారం మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన 136 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ప్రభుత్వం లో పేదోడి సొంతింటి కల ను నేరవేర్చేందుకు ఇళ్ల ను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. 22ఏ అంశం పై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారం ను తిప్పికొట్టాలనిపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కొడాలి గోవిందరావు, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ లు వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, నాయకులు నెల్లూరి భద్రయ్య,



మామిడి వెంకన్న, జెర్రిపోతుల సత్యనారాయణ, మరికంటి రమేష్, మేకల వెంకటేశ్వర్లు, కొమ్మూరి నరేష్, చెరుకుపల్లి రాజేష్, కర్లఆశోక్, ఇరగదిండ్ల నాగరాజు, యడవల్లి నాగరాజు, కడియాల నరేష్ వివిధ పంచాయతీల సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# సుజాతనగర్ రహదారిపై స్వీట్ కార్న్ సందడి

## వేపలగడ్డ - డేగలమడుగు మధ్య 15 మందికి ఉపాధి

**ప్రజాపక్షం/సుజాతనగర్:** మండలంలోని ప్రధాన రహదారిపై స్వీట్ కార్న్ మొక్కజొన్న కంకుల వ్యాపారం జోరుగా సాగుతోంది. వేపలగడ్డ నుంచి డేగలమడుగు వరకు సుమారు 15 మంది వ్యాపారులు రహదారి పక్కన తాటాకులు, నల్లపట్టాలతో పాకలు ఏర్పాటు చేసుకుని మొక్కజొన్న కంకులను విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఉదయం నుంచే పాకల వద్ద వ్యాపారం ప్రారంభించి సాయంత్రం వరకు కొనసాగిస్తున్నారు. కాలుతున్న మొక్కజొన్న కంకుల వాసన అటుగా వెళ్లే ప్రయాణికులను ఆకట్టుకుంటోంది. వాహనాల్లో వెళ్తున్న వారు కాసేపు ఆగి వేడివేడి కంకులను కొనుగోలు చేసి రుచిచూస్తున్నారు. ఉప్పు, కారం, నిమ్మరసం అద్దిన కాల్చిన కంకులకు చిన్నారుల నుంచి పెద్దల వరకు మంచి ఆదరణ లభిస్తోంది. కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణించే వారు వాహనాలను నిలిపి కంకులు కొనుగోలు చేసి తింటూ ఆనందిస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళ ప్రయాణికుల రాకపోకలు పెరగడంతో పాకల వద్ద సందడి నెలకొంటోంది.ఒకవైపు ప్రయాణికులకు ప్రయాణంలో కాసేపు ఆహ్లాదకరమైన విరామం లభిస్తుండగా, మరోవైపు ఈ చిన్న వ్యాపారాన్ని నమ్ముకున్న వారికి ఉపాధి దొరుకుతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడి కంకులు విక్రయిస్తూ వచ్చే ఆదాయంతో కుటుంబ అవసరాలను తీర్చుకుంటున్నారు. తక్కువ పెట్టుబడితో నిర్వహిస్తున్న ఈ వ్యాపారం సీజన్‌లో మంచి గిరాకీతో కొనసాగుతోంది. రహదారి వెంట వరుసగా కనిపిస్తున్న తాటాకు, నల్లపట్టాల పాకలు.. వాటి వద్ద కాలుతున్న మొక్కజొన్న కంకులు.. ప్రయాణికుల సందడితో వేపలగడ్డడేగలమడుగు మార్గం ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తోంది.



# వినాయక మండపాల వద్ద అన్నదానాలు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని వివిధ గ్రామాలలో శనివారం అన్నదాన కార్యక్రమం ను నిర్వహించారు. మండల కేందరంలో రెండు చోట్ల మహా అన్నదాన కార్యక్రమం ను నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ను తుంబూరు దయాకర్ రెడ్డి ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటి ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బచ్చలకూరి నాగరాజు, గోవిందరావు, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, నెల్లూరి భద్రయ్య, మైశా శంకర్, పసుపులేటి శ్రీలత, ఇరగదిండ్ల నాగరాజు, అంజిని, సత్యనారాయణ, కడియాల నరేష్, రోహిత్ పాల్గొన్నారు.



# ఐటీసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నూతన అధ్యక్షుడిగా సురేంద్ర

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఐటీసీ భద్రాచలం పేపర్ బోర్డు కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏ 49 సమావేశం సారపాకలో యూనియన్ ప్రధాన కార్యదర్శి పాటి సోమిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి యూనియన్ ప్రధాన సలహాదారు, ఐఎన్‌టీయూసీ ఈ 232 అధ్యక్షుడు గోనె రామారావు, యూనియన్ ప్రధాన సలహాదారు, ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గత నెల ఉద్యోగ విరమణ చేసిన యూనియన్ అధ్యక్షుడు ఊర్లుగొండ వీరన్న స్థానంలో పూనెం సురేంద్రను అధ్యక్షుడిగా, గల్లా ఉమామహేశ్వరరావును కోశాధికారిగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్ష, కోశాధికారులను సభ్యులు సన్మానించారు. ఈసమావేశంలో యూనియన్ స్థితిగతులు, భవిష్యత్ కార్యాచరన, పెండింగ్ సమస్యలపై చర్చించారు. ఈకార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఈ 232 కోశాధికారి చింతల వినోద్‌కుమార్, ప్లాంటేషన్ మహిళలు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.



# ఆరు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి

**ప్రజాపక్షం/ఇల్లందు:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని పంటలు దెబ్బతిన్నందున భద్రాద్రి కొత్తగూడెంలోని ఇల్లందు, గుండాల, ఆళ్లపల్లి, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి పడిగ మంగన్న డిమాండ్ చేశారు. వర్షాలు లేక భూమిలో తేమ తగ్గిపోవడంతో మొక్కజొన్న పంటలు ఎండిపోయి కంకులు రాకుండా దెబ్బతిన్నాయని తెలిపారు. ఎరువుల ధరలు పెరగడంతో పెట్టుబడి వ్యయం గత ఏడాదితో పోలిస్తే గణనీయంగా పెరిగిందని, రైతులు ఎకరాకు సుమారు రూ 50వేల వరకు పెట్టుబడి పెట్టారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఆరు మండలాల్లో పంట నష్టాలపై సర్వే నిర్వహించి బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు.

# సింగరేణి స్థలాలను క్రమబద్ధీకరించాలి

**ప్రజాపక్షం/ఇల్లందు:** సింగరేణి ఆధీనంలో ఉన్న, ఓసీ పరిధిలోకి రాని స్థలాల్లో ఏళ్లుగా నివసిస్తున్నకుటుంబాల ఇళ్ల స్థలాలను జీవో నం 76 ప్రకారం క్రమబద్ధీకరించి పట్టాలు అందించాలని విజయలక్ష్మీనగర్ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు కోరారు. ఈ మేరకు ఇల్లందు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. విజయలక్ష్మీనగర్‌కు సుమారు 130 ఏళ్ల చరిత్ర ఉందని, నాలుగు తరాలుగా నివసిస్తున్న పలు కుటుంబాలకు ఇప్పటికీ సరైన ఇళ్లు, మౌలిక వసతులు లేవని తెలిపారు. సింగరేణి ఆధీనంలో స్థలాలున్నాయనే కారణంతో ఇళ్ల నిర్మాణం, మరమ్మతుల విషయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జీవో 76 ప్రకారం అర్హత ఉన్న ప్రాంతాలను క్రమబద్ధీకరించి ప్రజలకు పట్టాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన తహసీల్దార్ సమస్యను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# బడుల్లో పచ్చదనం నింపాలి

**ప్రజాపక్షం/కామేపల్లి:** పాఠశాల ఆవరణల్లో పచ్చదనం పెంపొందించడం ద్వారా విద్యార్థులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కలుగుతుందని కెప్టెన్ బంజారా సర్పంచ్ ఆరేం అచ్చమ్మ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. పచ్చని చెట్లతో పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సీనియర్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# చేగొమ్మ విద్యార్థుల క్రీడా జయకేతనం

**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి జెడ్‌పిహెచ్‌ఎస్‌లో సెప్టెంబర్ 17,18 తేదీల్లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీల్లో చేగొమ్మ జెడ్‌పిహెచ్ఎస్ విద్యార్థులు సత్తా చాటారు. సీనియర్ బాలికల ఖోఖో, వాలీబాల్, జూనియర్ బాలికల ఖోఖో, సీనియర్ బాలుర ఖోఖోలో ప్రథమ స్థానాలు సాధించారు. సీనియర్ బాలికల కబడ్డీలో ద్వితీయ, జూనియన్ బాలికల వాలీబాల్‌లో తృతీయ, జూనియర్ బాలుర ఖోఖోలో ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. విజేతలను చేగొమ్మ సర్పంచ్ బత్తుల వీరస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి రాధాకృష్ణ అభినందించారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన పీడీ పి రాజును కూడా ప్రశంసించారు. అనంతరం విజేతలకు సర్పంచ్ చేతుల మీదుగా షీల్డులు, పతకాలు ధ్రువపత్రాలు అందజేశారు.



# మండలస్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి జెడ్‌పిహెచ్‌ఎస్‌లో సెప్టెంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీల్లో నాయకన్‌గూడెంలోని మహాత్మా జ్యోతి బాపులే గురుకుల పాఠశాల విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్లుగా నిలిచారు. సీనియర్ బాలుర విభాగంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్‌లో ప్రథమ స్థానాలు, జూనియర్ విభాగంలో వాలీబాల్, కబడ్డీలో ప్రథమ, ఖోఖోలో ద్వితీయ స్థానాలు సాధించారు. దీంతో మండల స్థాయిలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ దక్కించుకున్నారు. విజేతలను ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి సిహెచ్ రాంబాబు, ప్రిన్సిపాల్ పి మల్లయ్య, ఏటీపీ నాగ ప్రేమలత, డిప్యూటీ వార్డెన్ నరసింహారావు, వ్యాయామ ఉపాధ్యాయులు బి నరసింహ, టి భాస్కర్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి జాతీయ స్థాయిలో పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



# కేజీబీవీలో ఘనంగా 'స్వచ్ఛత హీ సేవ'

**- మొక్కలు నాటిన అదనపు జూనియర్ సివిల్ జడ్జి బిందు ప్రియ**




**ప్రజాపక్షం/ముదిగొండ:** స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఖమ్మం జిల్లా అదనపు జూనియర్ సివిల్ జడ్జి బిందుప్రియ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని, విద్యార్థులు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని న్యాయమూర్తి సూచించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవచ్చని, ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాలలోని స్టోర్ రూం, భోజనశాల, నిత్యావసర సరుకుల నిల్వలను పరిశీలించారు. సీఐ మురళి విద్యార్థినులకు మాదకద్రవ్యాల నివారణ, సైబర్ సెక్యూరిటీ, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా వినియోగంలో సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవి కుమార్, ఆర్ఐ కళ్యాణి, ఎంఈఓ రమణయ్య, కేజీబీవీ ఎస్ఓ బండారు ఇందిర, ఇంఛార్జి ఎంపీఓ రామకృష్ణ, ఏపీఓ రమాదేవి, సర్పంచి, ఉపసర్పంచులు సలీమా ఖాసీం బాబు, రమాదేవి, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ వెంకటలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.

# పండుగలు ప్రజల ఐక్యతకు దోహదం

**మున్సిపల్ ఛైర్‌పర్సన్ సామినేని సుజాత**

**ప్రజాపక్షం/మధిరః** మత సామరస్యానికి మధిర పట్టణ ప్రతీకగా నిలుస్తుందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ సామినేని సుజాత రామనాథం పేర్కొన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మధిర మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్, టీచర్స్ కాలనీల్లో గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో కొలువుదీరిన గణేష్ మండపాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం సామినేని సుజాత మాట్లాడుతూ ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించుకునేందుకు పండుగలు, ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయని స్పష్టం చేశారు. మన పూర్వీకుల నుంచి వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కర్నాటి కిరణ్, రావూరి శ్రీను, కౌన్సిలర్ యన్నం కోటేశ్వరరావు, వై.చారులత, రిటైర్డ్ ఎంఈవో వై.ప్రభాకర్, పిఆర్‌టియు నాయకుడు ఆర్.బ్రహ్మారెడ్డి, కాంగ్రేస్ నాయకులు దోర్నాల వెంకట రవి తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తిరుమలాయపాలెం మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పసలాది సత్యనారాయణ, పప్పుల శ్రీనివాసరావు కోరారు. వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రెస్‌క్లబ్ కార్యాలయ ఆవరణలో జర్నలిస్టుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతోపాటు జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని హెల్త్ కార్డులు అందించాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేసి, వృత్తిలో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. సమాజంలో జరుగుతున్న ప్రతీ అంశాన్ని ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలను గుర్తించి తగిన ప్రోత్సాహం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో గౌరవ సలహాదారుడు మేకల నాగరాజు, ఉపాధ్యక్షుడు పోలేపొంగు నాగరాజు, కోశాధికారి ఉబ్బని సుందర్‌రావు, ప్రచార కార్యదర్శి గుజ్జ రామకృష్ణ, కూరపాటి విజయ్, కొలిశెట్టి వేణు, ఎడవల్లి నాగరాజు, గోవింద సురేశ్, గాదారి బాబు, గాదారి వెంకన్న, కామల్ల వీరయ్య, మెట్టు రుద్రరాజు, పుల్లూరి ప్రభాకర్, ఏలూరి ఆనందరావు పాల్గొన్నారు.

# జాబ్‌మేళాలో సత్తా చాటిన ఎస్‌బిఐటి విద్యార్థులు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కోదాడలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో ఎస్‌బిఐటి కళాశాలకు చెందిన విద్యార్థులు 73 మంది ఉద్యోగాలు సాధించి సత్తా చాటారని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ ఉద్యోగ మేళాలో 340 కంపెనీలు పాల్గొన్నాయన్నారు. ఖమ్మం జిల్లా నుండి తమ కళాశాల విద్యార్థులు వివిధ హోదాల్లో ఉద్యోగాలు సాధించి జిల్లా ప్రతిష్టను పెంచారని గుండాల కృష్ణ తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా।। జి. ధాత్రి మాట్లాడుతూ గుగూల్, విప్రో, ఫాక్స్‌కాన్, ఐసిఐసిఐ బ్యాంక్, కోటక్ మహేంద్ర బ్యాంకులతో పాటు ఐటి, ఫార్మా, కన్‌స్ట్రక్షన్ వంటి వివిధ రంగాలకు చెందిన కంపెనీలు ఉద్యోగ మేళాలో పాల్గొన్నాయన్నారు. తమ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం కళాశాలకే కాకుండా ఖమ్మం జిల్లాకు గర్వకారణంగా నిలిచారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు తెలంగాణ రైజింగ్ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ, టాస్క్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ మెగా జాబ్ మేళాలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంఎల్‌ఏ పద్మావతి రెడ్డి లు పాల్గొని ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందించినట్లు కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. ప్రిన్సిపాల్ డా।। జి. రాజ్ కుమార్ మాట్లాడుతూ మెగా జాబ్‌మేళాకు తమ కళాశాలకు చెందిన చివరి సంవత్సరం సిఎస్ఈ, ఈసిఈ, ఈఈఈ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. నిరంతర శిక్షణ, ఉద్యోగాల సాధనకు ఉపయోగపడినట్లు ఆయన తెలిపారు. కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్, అప్టిట్యూడ్ అండ్ రీజనింగ్ వంటి వివిధ ఆధునిక సాంకేతిక శిక్షణ ద్వారా ఈ ఘనత సాధించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఇటువంటి శిక్షణలు మరింతగా అందించి బహుళ జాతి సంస్థకు ఎంపికయ్యేలా చూస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, టిపివో ఎన్. సవిత, జి. ప్రభాకర్, కె. ప్రశాంతి పాల్గొన్నారు.



# రేపు ప్రజావాణి రద్దు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కలెక్టరేట్‌లో ఈనెల 21న (సోమవారం) నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని అనివార్య పరిపాలన కారణాల రిత్యా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల , డివిజన్ల స్థాయిలో నిర్వహించబడే ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా సోమవారం మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించబడుతుందన్నారు. ఇట్టి విషయాన్ని గమనించాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# తీర్థాల నిమజ్జన ఘాట్ పరిశీలన



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని తీర్థాలలోని మున్నేటి వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన ఘాట్‌ను రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జనం ప్రశాతంగా జరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సమాలోచనలు చేశారు. 4క్రేన్‌లోతో పాటు 40 మంది గజీతగాళ్లను ఉంచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వినయేందర్‌రెడ్డి, ఎంపిడీఓ రవికుమార్, సిఐ ముష్క రాజు, ఇరిగేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



**ప్రజాపక్షం/మధిరః** ఇల్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని జెడ్పీహెచ్‌ఎస్, సిపిఎస్ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన యూనిఫాం, షూస్‌ను సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మి పంపిణీ చేశారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ యూనిఫాం, షూస్ అందించే కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ కోట వీరయ్య, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా వినాయక కళ్యాణ మహోత్సవం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరం బైపాస్ రోడ్డులో గల తారక రామా ఆటో నగర్ ఫోర్ విలర్స్ టెక్నిషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా వరసిద్ధి వినాయక కళ్యాణ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవం సందర్బంగా ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకం, పుణ్యాహ వచనం, పంచగవ్య, కళ్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ వైభోగంగా నిర్వహించారు. వేద ఆశీర్వాద అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు మహంకాళి మల్లికార్జునరావు, కేశగాని రవి, కనకం రామకృష్ణ, బానోత్ రాందాస్ నాయక్, గుజ్జుల వెంకటరెడ్డి, మట్టా బీమయ్య, కొనకటి శ్యామేందర్‌రెడ్డి, గంగవరపు శ్రీనివాసరావు, పబ్బు భాస్కర్, మహంకాళి మహేష్, ఫోర్ విలర్స్ టెక్నిషియన్ సభ్యులు, గణపతి మాల ధరించిన స్వాములు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

# మొక్కల పెంపకం ప్రకృతి పట్ల బాధ్యత



**ప్రజాపక్షం/ముదిగొండ:** మొక్కల పెంపకం ద్వారా ప్రకృతి పట్ల బాధ్యత పెరుగుతుందని పమ్మి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేశ్ అన్నారు. పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు పాఠశాల ఆవరణలో, రోడ్ల వెంబడి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రధానోపాధ్యాయుడు సూచించారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించే బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాధిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ధర్మం గెలిచింది..దానం నాగేందర్‌పై అనర్హత వేటు



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. బిఆర్ఎస్ తరుపున 2023లో ఖైరతాబాద్ నుంచి గెలిచి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరి 2024లో సికింద్రాబాద్ లోక్ సభకు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేస్తూ సంచనల తీర్పు ఇచ్చింది. పార్టీ ఫిరాయించలేదని గతంలో స్పీకర్ ఇచ్చిన తీర్పును హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్ ధర్మాసనం కొట్టి వేసి ఖైరతాబాద్ స్థానం ఖాళీగా ప్రకటించాలని ఎన్నికల సంఘానికి ఆదేశించింది. ఈ తీర్పుతో ధర్మం గెలిచిందని, సత్యమేవ జయతే అని అశ్వారావుపేట బిఆర్ఎస్ మండల నాయకులు స్పందించారు. ఈ తీర్పు నేపథ్యంలో అశ్వారావుపేట మండల బిఆర్ఎస్ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో కాసాని చంద్రమోహన్, పద్మ, భూక్య ప్రసాద్, ఉద్యయజ్యోతి, జుజ్జురపు శ్రీరామ్మూర్తి, సత్యవరపు సంపూర్ణ, గుడవర్తి వెంకటేశ్వరరావు, మోటూరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న లింగాల

**ప్రజాపక్షం/మధిరః** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మధిర మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్‌లో బిఆర్ఎస్ నాయకులు, మాజీ జెడ్పీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజ్ పాల్గొన్నారు. వినాయకుని మండపం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బిక్కి కృష్ణప్రసాద్, కనుమూరి వెంకటేశ్వరరావు, అరిగే శ్రీనివాసరావు, రావూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# భిన్నత్వంలో ఏకత్వమే మన సంస్కృతి

**- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పండుగలు ఉత్సవాలు సమాజంలో మత సామరస్యానికి సోదరభావానికి నిదర్శనాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 50వ డివిజన్ దర్జన్ బస్తీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివాహం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యాతిధిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలను తిలకించారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించి బస్తీ ప్రజలకు భక్తులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఆచార వ్యవహారాలు సర్వ మానవ సౌభ్రాతృత్వానికి భిన్నత్వంలో అకత్వాన్ని చాటి చెబుతాయని తెలిపారు. కులమతాలకు అతీతంగా ప్రజలంతా కలిసిమెలిసి జీవించినప్పుడే సమాజం శాంతి యుతంగా ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో పయణించి ఆదర్శసమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఆకలిని తీర్చే అన్నదానం ఎంతో మహోన్నతమైందని ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 50వ డివిజన్ కార్పొరేటర్ దాసరి శ్రీనివాస్ ఉత్సవకమిటీ సభ్యులు సికిందర్ సింగ్ పుణ్ణంసింగ్ రథంకోర్ నంగి కౌర్ బహుద్దూర్ సింగ్ బీమా సింగ్ పవన్ సింగ్ బల్వం సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యంగా ముందుకు సాగుదాం

**- అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మేయర్**



**ప్రజాపక్షం/పాల్వంచ :** కొత్తగూడెం మునిసపల్ కార్పోరేషన్ పరిధి పాల్వంచ డివిజన్‌ల అభివృద్ధికి ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు సహకారంతో ఐక్యంగా ముందుకు సాగుదామని మేయర్ మూడ్ గణేష్ అన్నారు. పాల్వంచ 35వ, డివిజన్‌లో 6 లక్షల నిధులతో డ్రైన్ నిర్మాణ పనులకు శనివారం శంఖుస్థాపన చేశారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన సభలో మేయర్ మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా పాల్వంచకు ఎన్నికలు లేకపోవటంతో అభివృద్ధి అనుకున్నంతగా జరగలేదన్నారు. దీనిని అధిగమించటానికి కార్పోరేషన్ ఏర్పాటు చేసి పాల్వంచకు ఎన్నికలు తీసుకొచ్చిన ఘనత ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావుకే దక్కుతుందన్నారు. ఎంఎల్‌ఏ నేతృత్వంలో పాల్వంచను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు నావంతు కృషి చేస్తానని చెప్పారు. ఎన్నో ఏండ్లుగా అపరిష్కృతంగా ఉన్న పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసుకొందామన్నారు. ప్రజలకు కావలసిన కనీస మౌళిక వసుతులైన తాగునీరు, రహదారులు, డ్రైనేజీలు నిర్మాణానికి పాటుపడుతున్నామని దానికి ప్రజలు సహకారం అందించాలని కోరారు. దశల వారీగా పాల్వంచలోని 27 డివిజన్‌లను అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మేయర్‌ను మహిళలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్ సిరిపురపు లలిత కుమారి, 35వ, డివిజన్ కార్పొరేటర్ నామా కీర్తి, కార్పొరేటర్లు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, శ్యామలా దినేష్, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు, సిపిఐ సీతారామపట్నం శాఖ కార్యదర్శి తంతెనపల్లి వెంకన్న, నాయకులు మేదరమెట్ల నారాణ, నామా నవీన్, నామా పండు, గౌతం, గుర్రం వెంకటేశ్వర్లు, తూము రాము, వీరారెడ్డి, ప్రకాష్, కొప్పర నాగేశ్వరరావు, బదర లక్ష్మయ్య, కాల్వ భూషణం, నాగేశ్వరరావు, పవన్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతా హి సేవ



**ప్రజాపక్షం/అశ్వాపురం:** స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం అశ్వాపురం గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ బానోత్ సదర్‌లాల్ ఆధ్వర్యంలో పంచాయితీ సిబ్బంది బహిరంగ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో నిరంతర పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా, తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సిబ్బందికి అందించాలని ప్రజలకు సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ తుళ్లూరి ప్రకాష్‌రావు, పంచాయితీ కార్యదర్శి యాకూబ్, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## హైదరాబాద్, తిరుపతికి నూతన బస్సు సర్వీసులు

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ప్రయాణికుల సౌకర్యార్థం మణుగూరు ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్ బిహెచ్‌ఈఎల్‌కు ప్రతిరోజూ రాత్రి 7, 8, 9 గంటలకు మూడు సర్వీసులు అందుబాటులో ఉంటాయని డిపో మేనేజర్ కె. శ్యాంసుందర్ తెలిపారు. అలాగే భక్తుల సౌకర్యార్థం ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటలకు మణుగూరు నుంచి తిరుపతికి బస్సు నడుస్తుందని తెలిపారు.

## శతాధిక కవి సమ్మేళనం జయప్రదం కావాలి

**- ఐటిడిఏ పిఓ రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** డా.పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కాలేజీలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జరిగే 176వ శతాధిక కవి సమ్మేళనం జయప్రదం కావాలని ఐటిడిఏ పిఓ రాహుల్ ఆకాంక్షించారు. ఇందుకు సంబంధించి శనివారం తన ఛాంబరో పోస్టర్ ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా 200 మంది కవులు ఈ సమ్మేళనానికి రానుండటం అభినందనీయం అన్నారు. తెలుగుభాష యొక్క గొప్పతనాన్ని భావితరాలకు చాటి చెబుతాయని పేర్కొన్నారు. తెలుగు బాష వారసత్వ సంపదను ప్రపంచానికి తెలిపేలా భద్రాచలం కేంద్రంగా కవి సమ్మేళం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధికార ప్రతినిధి పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ వరలక్ష్మి సాయిరాం, రాష్ట్ర కో ఆర్డినేటర్ సురేష్ బాబు జిల్లా ప్రతినిధి ఎర్రంశెట్టి పూర్ణిమ పాల్గొన్నారు.

## అట్టహాసంగా ప్రారంభమైన జోనల్ స్థాయి క్రీడా పోటీలు



**ప్రజాపక్షం/పినపాకః** పినపాక మండలంలోని ఏడూళ్ల బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 70వ పినపాక జోనల్ స్థాయి క్రీడా పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పినపాక, కరకగూడెం మండలాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొంటున్నట్లు పినపాక ఎంఈఓ కొమరం నాగయ్య తెలిపారు. జోనల్ స్థాయి క్రీడా పోటీల సందర్భంగా విద్యార్థుల మార్చ్‌పాస్ట్, క్రీడా జ్యోతి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం వివిధ క్రీడాంశాల్లో పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో కబడ్డీ, కోకో వాలీబాల్, రన్నింగ్ తో పాటు అన్నీ రకాల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తునట్లు పీడి వీరన్న తెలిపారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు, శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, జట్టు భావనను అభివృద్ధి చేయడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని వారు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేసే అవకాశం ఉంటుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వాగబోయిన చందర్ రావు, ఉప సర్పంచ్ గంగిరెడ్డి సందీప్ రెడ్డి,పినపాక హెచ్ ఎం రామిరెడ్డి, పిడీలు వీరన్న, అనిల్, వరలక్ష్మి , రాములమ్మ, బాలరాజు, మహేష్, విజయలక్ష్మి , విజయ, మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## విద్యార్థికి అభినందనలు




**ప్రజాపక్షం/పాల్వంచ :** వికలాంగ విద్యార్థుల క్రీడల్లో జరిగిన చెస్ పోటీలో మెరుగైన ప్రతిభ కనభరిచి మొదటి స్థానాన్ని కైవసం చేసుకొని రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థి నంద్యాల సాంబయ్యను ఉపాద్యాయులు శనివారం అభినందించారు. స్థానిక కొమ్ముగూడెం పాఠశాలలో శుక్రవారం జరిగిన వికలాంగ విద్యార్థుల ఆటల పోటీల్లో కొమ్ముగూడెం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి సాంబయ్య చెస్ క్రీడలో మొదటి స్థానం సాధించాడు. దీనితో పాఠశాల ఉపాద్యాయులు సాంబయ్యను ఘనంగా అభినందించారు. రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో సైతం మొదటి స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాద్యాయులు ఎన్. వరవరరావు, పిడి జి. రాము, టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వినోబానగర్‌లో జెడ్పీ సీఈఓ పర్యటన



**ప్రజాపక్షం/జూలూరుపాడుః** జూలూరుపాడు మండల పరిధిలోని వినోబానగర్ గ్రామంలో జడ్పీ సీఈఓ నాగలక్ష్మి పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామ పరిసరాలను, వీధులను పరిశీలించి 4వే సిగ్రిగేషన్ ప్రతి వార్డులో అమలుపర్చాలని, వివో బిల్డింగ్ పనులను పరిశీలించి, వాటిని ఒక నెల లోపల పూర్తిగా అందుబాటులోకి వచ్చేటట్టు (పనులు పూర్తి అయ్యేటట్టు) చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్థానిక పాఠశాలను సందర్శించి పాఠశాల వద్ద సోక్ పిట్ నిర్మించుకోవాలని పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిబీఎస్ సీటు సాధించిన వంశీ



**ప్రజాపక్షం/జూలూరుపాడుః** ఎంబీబిఎస్ సీటు సాధించిన గ్రామీణ వైద్యుని తనయుడు విద్య వైద్యంలో ప్రవేశం పొందడం పట్ల జూలూరుపాడు మండల గ్రామీణ వైద్యులు హర్షం వ్యక్తం చేశారు. జూలూరుపాడు మండలపరిధిలోని బేతాళపాడుగ్రామ పంచాయతీ, గొల్లగూడెం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యులు పనిత మార్కు నిర్మల తనయుడు పనిత వంశీ 202627 గాను కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీట్ పరీక్షలు రాసి సిఎంఆర్ ఇన్సిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వైద్య కళాశాలలో సీటు సంపాదించి తన సత్తా చాటారు. విషయం తెలిసిన జూలూరుపాడు మండలంలోని గ్రామీణ వైద్యులు పనితి వంశీని అభినందించి శాలువాతో సన్మానించి, అభినందనలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు గడిదేసి ప్రేమ్ కుమార్, పూసల శ్రీనివాసాచారి, జొన్నల రమేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అన్నదానం



**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు మండలంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డిపుల్లారెడ్డి, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు తోట రమేష్ తదితరులు హాజరై వినాయకుడికి కొబ్బరికాయ కొట్టారు .అనంతరం లారీ ఓనర్స్ అసోసియేషన్ వారితో పాటు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాల సత్యనారాయణ, సురేందర్ రెడ్డి, కోశాధికారి జయపాల్ రెడ్డి,ఉపాధ్యక్షులు తాత అబ్బాయి, చందర్రావు, 14 టైర్స్ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొని నాయకులను సన్మానించారు.

## గురుకుల పాఠశాల తనిఖీ



**ప్రజాపక్షం/పాల్వంచ :** విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణాన్ని అందించేందుకు కృషి చేయాలని సంభంధిత అధికారులను మండల ప్రత్యేక అధికారి జి. శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి లక్ష్మిదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల (సిఓఈ) బాలుర పాఠశాలను మండల ప్రత్యేక అధికారి శనివారం ఆకస్మికంగా సంధర్శించారు. ఈ సంధర్భంగా స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు.నిల్వ చేసిన సరుకుల నాణ్యతను, ఎక్స్‌పైరీ తేదీలతో పాటు పాఠశాల ఆవరణంలోని పారిశుధ్య పనులను, బాత్రూమ్ తలుపులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రుచి, నాణ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు,ఉపాద్యాయులుపాల్గొన్నారు.

## విద్యార్థులకు మొక్కలు సంరక్షణపై అవగాహన

**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఏక్ పెడ్ మాకే నామ్ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఆధ్వర్యంలో ప్రారంభించారు. కారేపల్లి జెడ్‌పిహెచ్‌ఎస్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి, దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఒక్కో మొక్కను ఎంపీడీవో అందజేశారు. ఈకార్యక్రమంలో కారేపల్లి సర్పంచ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, జెడ్‌పిహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు, ఏపీవో, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పంచాయితీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయితీ సిబ్బంది, పాల్గొన్నారు.

# మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



**వన మహోత్సవంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్**

ప్రజాపక్షం/వైరాః వైరా మున్సిపాలిటీ పరిధిలోని నాల్గో వార్డులో ఉన్న ప్రభుత్వ బాలుర పాఠశాలలో శనివారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ ప్రతిక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో విరివిగా మొక్కలు నాటి పెంచాలని సూచించారు. ప్రతిఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షిస్తే భవిష్యత్తులో పచ్చదనం పెంపొందించడంతో పాటు కాలుష్య నియంత్రణకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. నాటిన మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షించి చెట్లుగా పెంచే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామచంద్రరావు, తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, ఏఎంసి చైర్మన్ బోళ్ళ గంగారావు, డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కాపా మురళీకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సీతారాములు, మిట్టపల్లి నాగి, రాంపూడి రోశయ్య, దార్న రాజశేఖర్, ఫణితి శ్రీనివాసరావు, వీరయ్య, జాలాది రామకృష్ణ, తోటకూర శ్రీకాంత్, ఖాన్ పార్టీ సత్యనారాయణతో పాటు పలువురు మున్సిపల్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా అన్నదానం



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : గణేష్ నవరాత్రోత్స వాల సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. శనివారం వి. వెంకటాయపాలెం గ్రామంలో శ్రీకంఠమహేశ్వర స్వామి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాపా ఆదినారాయణ, ఉప సర్పంచ్ గుగులోత్ ప్రవీణ్ పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## తల్లాడలో ఘనంగా వినాయక నిమజ్జనం



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ పట్టణంలో వినాయక నవరాత్రోత్సవాల ముగింపు సందర్భంగా వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు పూజారి తనుగుల మణికంఠ శర్మ మంత్రోచ్ఛరణల నడుమ ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తిశ్రద్ధలతో కొలువు దీరిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉదయం స్వామి వారి కలశంతో తల్లాడ పుర వీధుల్లో మేళతాళలతో, బాజా భజంత్రిలతో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం భారీ ఊరేగింపుతో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని రెడ్డి యువజన సంఘం ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను యువజన కమిటీ చేపట్టారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పెరికె నాగేశ్వరరావు, రెడ్డి సంఘం నాయకులు రెడ్డెం వీర మోహన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, అప్పిరెడ్డి, పుల్లారెడ్డి, నాగేశ్వరరావు, కరుణాకర్‌రెడ్డి, నిర్వాహకులు రాజశేఖర్, గోపాల్‌రెడ్డి, భద్రారెడ్డి, జమలారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



ప్రజాపక్షం/బోనకల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో తీవ్రంగా విఫలమైందని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు విమర్శించారు. మండలంలోని చిరునోముల గ్రామ శాఖ సమావేశం శాఖ కన్వీనర్ గుంపుల జయరాజు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈసందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 15 నుంచి ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు చేస్తామని ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో ఇప్పటికీ స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. రైతులు, నిరుద్యోగులు, ఇచ్చిన హామీలపై ప్రభు త్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకుని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో సిపిఐ మండల నాయకులు ఆకెన పవన్, మాతంగి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



ప్రజాపక్షం/ తల్లాడ : పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తల్లాడ మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉప సర్పంచ్ కెవి లు సూచించారు. శనివారం అన్నారుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సేవా 2026 కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లాడ మాజీ ఎంపిపి శ్రీనివాసరావు, సర్పంచ్, ఉప సర్పంచ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కల ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అమ్మ పేరుతో ఒక మొక్క మన తల్లికిచ్చే గొప్ప కానుక అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగి పర్యావరణ పరిరక్షణకు భాగస్వాములవ్వాలని వారు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటుదాం ప్రకృతిని కాపాడుదామని వారు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, నాగుల్, సీతారాములు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గిరిజారాణి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

## నూతనకల్‌లో లాసలేట్ మరియతల్లి వేడుకలు



ప్రజాపక్షం/ తల్లాడ : మండల పరిధిలోని నూతనకల్ విచారణలో పరిశుద్ధ లాసలేట్ మరియతల్లి మహోత్సవ వేడుకలను విచారణ గురువులు రెవ ఫాదర్ నిఖిల్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోమన్ క్యాథలిక్ ఖమ్మంజిల్లా పీఠాధిపతులు డా॥ సగిలి ప్రకాష్‌కు డి డికి విచారణ గురువులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బిషప్ సగిలి ప్రకాష్ మాట్లాడుతూ పరిశుద్ధ లాసలేట్ మరియ తల్లి మహోత్సవాన్ని నూతనకల్ దేవాలయంలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తల్లాడ విచారణ గురువులు, మిట్టపల్లి విచారణ గురువులు, సిస్టర్స్, ఉపదేశికులు, సంఘ పెద్దలు, మరియ దళం సభ్యులు పాల్గొన్నారు.

## కళాశాలలో వంటా వార్పు

ప్రజాపక్షం/మధిరః రాష్ట్ర ప్రభుత్వ జీవో నెంబర్.97 ద్వారా పాలిటెక్నిక్ విద్యను కొత్తగా ఏర్పాటు చేసిన శక్తి శాఖలో, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సాంబయ్య, టిపిజేఏసి మధిర ప్రెసిడెంట్ ఎం.వినోద్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ కె.సాంబశివరావు పాల్గొన్నారు.

## సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం

ప్రజాపక్షం/ ఎర్రుపాలెః జమలాపురం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు బొబ్బా కృష్ణ ప్రసాద్, ఎల్వి నారాయణరెడ్డి తెలిపారు. శనివారం మధిర మండలం రొంపిమళ్ల గ్రామానికి చెందిన తలపురెడ్డి కార్తీక్‌కుమార్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వారి తల్లిదండ్రులు గోవర్ధన్‌రెడ్డి, హర్షిత దంపతుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి గౌరవాధ్యక్షురాలు కోడాలి విజయలక్ష్మీదేవి, ఉపాధ్యక్షురాలు గిరిజాలక్ష్మీ, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, సహాయ కార్యదర్శి చింతా కిషోర్, కోశాధికారి వీరమాచినేని వెంకటకృష్ణ, కాకుమాను లీలాకృష్ణ, అల్లూరి విష్ణుమూర్తి, చొప్పవరపు శ్రీనివాసరావు తదితరుల పాల్గొన్నారు.

## చింతకానిలో భూ లొల్లి

**-వేసిన వరి మొక్కలను పీకిన మహిళలు**

ప్రజాపక్షం/ చింతకాని : దశాబ్ద కాలంగా రగులుతున్న భూ వ్యవహారంలో ఈరోజు కొందరు వేసిన వరి మొక్కలను పీకేశారు. వివరాల్లోకి వెళితే... ఈ భూ వివాదం ఆసక్తికరంగా ఉండడంతో పాటు సుదీర్ఘంగా సాగుతుంది. బిఆర్ఎస్ ప్రభుత్వం మొదటి దఫా ఏర్పడినప్పుడు దళితులకు భూమి కొనుగోలు విషయానికి సంబంధించి చింతకాని మండలం చింతకాని గ్రామంలో భూమిలేని నిరుపేదలను ఎంపిక చేసింది. అందులో తొమ్మిది కుటుంబాలకు 26 ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఇచ్చింది. అయితే భూమి కేటాయింపుకు సంబంధించి లాటరీ పద్ధతిని అవలంభించారు. కానీ అక్కడి దళితులు మాత్రం ఎవరికి భూమి వచ్చిన లాటరీలో అందరం సమానంగా పంచుకుందామన్న ఆలోచన చేశారు. దీనికి చట్టబద్ధత లేకపోయినా లబ్ధిదారులు ఈవిధంగా నిర్ణయించుకున్నారు. లాటరీలో భూమి దక్కిన వారు ఆ తర్వాత మాకు వచ్చింది కాబట్టి మేమే అనుభవిస్తామంటూ ఎదురు తిరిగారు. ఆ తర్వాత దీనిపై పెద్ద రగడ జరిగింది. రెవెన్యూ అధికారులను, కలెక్టర్‌ను భూమి రాని పేదలు ఆశ్రయించారు. చిరవకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం లాటరీలో భూమిని ప్రభుత్వం ఎవరికి కేటాయించిందో వారికే దక్కుతుందని స్పష్టం చేయడంతో కొద్ది కాలం దీనిని గురించి ఎవరు పట్టించుకోలేదు. శనివారం భూమి రాని పేదలు వరి మొక్కలను పీకి వేయడంతో కొత్త సమస్య తలెత్తింది. దీనిపై బాధితుడు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదైనట్లు సమాచారం.

## విధుల్లో ఉన్న కండక్టర్ గుండెపోటుతో మృతి



ప్రజాపక్షం/ ఖమ్మం : విధి నిర్వహణలో ఉన్న కండక్టర్ గుండెపోటుతో మృతిచెందిన ఘటన శనివారం జరిగింది. ఖమ్మం డిపోలో పనిచేస్తున్న సామినేని లక్ష్మి నారాయణ విధి నిర్వహణలో భాగంగా డ్యూటీపై హైదరాబాద్ వెళ్లారు. ఈ రోజు తెల్లవారుజామున డ్యూటీకి వెళ్లిన లక్ష్మి నారాయణకు తీవ్రమైన గుండెపోటు రావడంతో మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. లక్ష్మి నారాయణది చింతకాని మండలం పాతర్లపాడు గ్రామం. ఆయన మృతిపట్ల ఆర్టీసి అధికారులు తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మొక్కల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ



ప్రజాపక్షం/వైరాః పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో వైరాలోని న్యూలిటిల్ ఫ్లవర్స్ పాఠశాలలో ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ బాజోజు ప్రవీణ్‌కుమార్, వైరా మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు, పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పట్ల అవగాహన, బాధ్యతాభావం పెంపొందించడమే కార్యక్రమంలో ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

## కోదాడ మెగా జాబ్‌మేళాలో నిధి ఐటి సొల్యూషన్స్



ప్రజాపక్షం/ఖమ్మంః కోదాడ పట్టణంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో ఖమ్మంకు చెందిన నిధి ఐటి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పాల్గొంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మెగా జాబ్‌మేళాకు యువత నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఉత్తమ్ పద్మావతి నిధి ఐటి సంస్థ ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించి, సంస్థ ప్రతినిధులను అభినందించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే వేదికను ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతికి ఐటి ఫౌండర్, చైర్మన్ రామోజీ ఉప్పలచారి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిధి ఐటి మేనేజ్‌మెంట్ అండ్ డైరెక్టర్ గారిడేపల్లి సాయికిరణ్, హెచ్ఆర్ ప్రతినిధులు మస్రత్, వినయ్, అర్చన, మురళి, శ్రీకాంత్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి తరలిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ గణనాధుడు



ప్రజాపక్షం/వైరాః వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రతిష్టించిన గణనాధుడి నిమజ్జన కార్యక్రమాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిమజ్జనానికి ముందు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన లడ్డు వేలంపాటలో కాంగ్రెస్ నాయకుడు వీరయ్య రూ.4వేలతో లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ స్వయంగా దగ్గరుడి గణనాధుడి విగ్రహాన్ని వాహనంపైకి తరలించారు. భారీ బాణసంచా కాలుస్తూ, భక్తుల సందడితో వైరా పట్టణంలో ర్యాలీగా నల్లచెరువు వద్దకు వినాయక విగ్రహాన్ని తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ ప్రజలు భక్తిశ్రద్ధలతో, పవిత్రతతో వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారని అన్నారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, వీరంశెట్టి సీతారాములు, మున్సిపల్ కౌన్సిలర్ కట్ల సంతోష్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, జిల్లా కాంగ్రెస్ డాక్టర్స్ అధ్యక్షుడు డాక్టర్ కాపా మురళీకృష్ణ, చెరుకూరి కిరణ్, రాంపూడి రోశయ్య, ఏదునూరి సీతారాములు, ఎమ్మెల్యే తనయుడు మాలోతు విగ్నేష్, బిడికె.రత్నం, మిట్టపల్లి నాగి, దార్న రాజశేఖర్, జాలాది రామకృష్ణ, జవ్వాజి నాగరాజు, కంభంపాటి సత్యనారాయణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.